నేడు కోకాపేట్‌లో అయ్యప్ప మహాపడిపూజ

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో సోమవారం ఉదయం 10గంటలకు అయ్యప్పస్వామి 18వ మహాపడిపూజను నిర్వహిస్తున్నట్లు గురుస్వామి శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కేశవ గురుస్వామి చేతుల మీదుగా గోపాల సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే మహాపడి పూజలో గంగపుత్ర నర్సింగ్‌రావు భజన, అరికె వెంకటమ్మ ఏర్పాటు చేసే అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల పరిశీలన అధికారిగా తైతులంగ్ పమేయ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ–51 సాధారణ ఎన్నికల పరిశీలన అధికారిగా తైతులంగ్ పమేయను కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించినట్లు రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇ. మల్లయ్య ప్రకటించారు. ఇప్పటి వరకు పరిశీలన అధికారిగా శిల్పా గుప్తా ఉండగా.. ఆమె స్థానంలో తైతులంగ్ పమేయను నియమించిందన్నారు. ఎన్నికల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులకు సందేహాలు, ఫిర్యాదులు ఉంటే ఎన్నికల సాధారణ పరిశీలన అధికారి తైతులంగ్ పమేయ (9030181777)కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

'సమ్మేళనాలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి'

అబిడ్స్: సమ్మేళనాలు ప్రజల్లో స్నేహభావాలను పెంపొందిస్తాయని ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ శశిర్ అగర్వాల్ పేర్కొన్నారు. అబిడ్స్ తాజ్ మహల్ హోటల్‌లో జరిగిన రాజస్థానీ ప్రగతి సమాజ్ దీపావళి సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజస్థానీ ప్రగతి సమాజ్‌ల వారు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌కుమార్, రాధాకిషన్‌రావు, గోవింద్‌రాఠి, రమేష్‌కుమార్ బంగ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్.. 'ట్రబుల్'!



హమీదుల్లానగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలు ఇలా..

- డబుల్ బెడ్రూం ప్రవేశాలపై నిర్లక్ష్యం
- నాలుగేళ్లయినా జరగని గృహ ప్రవేశాలు

శంషాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్రూంలకు ట్రబుల్ తప్పడం లేదు. నిర్మాణాలు పూర్తి చేసి నాలుగేళ్లు గడిచినా లబ్ధిదారులు గృహ ప్రవేశం చేయలేకపోతున్నారు. మౌలిక వసతుల కల్పనలో జాప్యంతో లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. మండలంలోని హమీదుల్లానగర్ పంచాయతీ పరిధిలో 20 డబుల్ బెడ్రూంలను నిర్మించారు. సుమారు రూ.2 కోట్లతో జీ ప్లస్ వన్, జీ ప్లస్‌టూ పద్ధతిలో ఏర్పాటు చేసిన ఈ నిర్మాణాలు నాలుగేళ్ల క్రితం పూర్తయ్యాయి. అప్పటి నుంచి లబ్ధిదారుల ఎంపిక చేపట్టకుండా తాత్సార్యం చేశారు. దీంతో ఈ గృహ సముదాయాలు మందుబాబులకు అడ్డాగా మారింది. తీవ్రజాప్యంతో తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇక్కడి పరిస్థితిపై 'సాక్షి'లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి.. గేట్లు ఏర్పాటు చేసి లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.



ఎంపిక జరిగినా.. ప్రవేశాలు లేవు..

డబుల్ ఇళ్ల కేటాయింపు కోసం రెండు నెలల క్రితం లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. దరఖాస్తులు భారీగా వచ్చినా కేవలం 20 ఇళ్లు మాత్రమే ఉండటంతో పోటీ నెలకొంది. లాటరీ ద్వారా ఎంపిక చేసిన అధికారులు ఇంకా లబ్ధిదారులకు ఎలాంటి పత్రాలను అధికారికంగా అందజేయలేదు.

కరెంటు కోసం ఎదురుచూపులు..

గృహ సముదాయానికి ఇప్పటి వరకు కరెంటు సరఫరా ఏర్పాటు చేయలేదు. లబ్ధిదారుల ఎంపిక తర్వాత వారి పేర్లతో కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. జాప్యం నెలకొంది. దీంతో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయలేని పరిస్థితి నెలకొంది. నీటి సరఫరా కోసం ఇటీవలే చర్యలు తీసుకున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో ప్రత్యేకంగా బోరు వేసి మోటారు బిగించారు.

కిటికీలు ధ్వంసం..

డబుల్ ఇళ్ల కిటకీల అద్దాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. ఏ ఒక్క కిటికీ కూడా అద్దాలు కనిపించడంలేదు. ప్రస్తుతం లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్తే కిటికీల అద్దాలను సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన సెప్టిక్ ట్యాంకు

అద్దె ఇల్లే దిక్కయింది..



నా కుటుంబం గత 12 ఏళ్ల నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. రెండు నెలల క్రితం డబుల్ బెడ్రూం కేటాయించారు. కాని అక్కడ కరెంటు లేదు. కిటికీల అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. మాకు ఇంటిని కేటాయించి, ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. నెలకు రూ.2,500 చెల్లించి అద్దె ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి ఉంది.

– కుమ్మరి రమేష్, హమీదుల్లానగర్

నీళ్లు ఇవ్వడం లేదు..



మిషన్ భగీరథ నీటి సరఫరా చేయడం లేదు. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం పంచాయతీ నిధులతో ప్రత్యేకంగా బోరు వేయించాం. నా సొంత డబ్బులతో మోటారు బిగించాను. కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. త్వరగా లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తే బాగుంటుంది.

– సతీష్‌కుమార్‌యాదవ్ సర్పంచ్, హమీదుల్లానగర్

డ్రైనేజీ పైపులు సైతం..

డ్రైనేజీ పైపులు సైతం పగిలిపోగా.. వీటికి కూడా మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. సెప్టిక్ ట్యాంకుల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేసి నింపేశారు.

ఫామ్ - 12డీకి 330 మంది దరఖాస్తు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలో 80 ఏళ్లు దాటిన వృద్ధులతో పాటు వికలాంగులు ఫామ్–12డీ ప్రకారం 330 మంది దరఖాస్తు చేసుకున్నారని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. సోమ, మంగళవారాల్లో రెండు రోజులు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికెళ్లి ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి 6 ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టీమ్‌లో సెక్టోరల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్, పోలీసు అధికారి, మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్ ఉంటారన్నారు. ఓటుహక్కును వినియోగించుకునే వారిని వీడియోను చిత్రీకరిస్తామన్నారు. రెండ్రోజుల పాటు 330 మంది ఇళ్ల వద్దకు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం 12–డీ ఫామ్ అందజేసి దరఖాస్తులను స్వీకరించామన్నారు. వాటిని పరిశీలించిన అనంతరం 330 మందికి ఈ అవకాశం అందించినట్లు స్పష్టం చేశారు.

సమాజానికి సామరస్యమే దిక్కు

అత్తాపూర్: మత సామరస్యం సమాజాన్ని ప్రశాంతంగా నిలబెడుతుందనే కాంగ్రెస్ సందేశంతో ఆ పార్టీ రాజేంద్రనగర్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ ప్రచారం చేస్తున్నారు. మతం ఇంటికి, వ్యక్తిగత జీవితానికి మాత్రమే పరిమితం కావాలనే రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. హిందూ, ముస్లింల సామాజిక సహజీవనానికి విఘాతం కలిగించే శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రవీణ్ రెడ్డి, బండారి రమేష్, సోమవారం రవీందర్, కె.సుధాకర్, రాజేంద్రనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి, రవీందర్‌గౌడ్, మహ్మద్ ఖలీద్, వనం మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆదివారం శివరాంపల్లి, బుద్వేల్, బన్సీలాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు హామీల కరపత్రాలను పంపిణీ చేశారు. బన్సీలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కే.ఎస్.దయానంద్, శివముదిరాజ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీలోని ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు.అనంతరం ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురువేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రవి, రఘు, చిన్న, ప్రవీణ్, సత్తిరాజు, గంగా, వంశీరాజు, ప్రభాకర్, గణేష్ తదితరులున్నారు.

మణికొండలో తలారి మల్లేష్ ఆధ్వర్యంలో..

మణికొండ: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ గండిపేట మండల సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్ నాల్గోసారి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కలీం, ముజాహిద్, ఇబ్రహీం, అమీర్, మాజీద్, గఫూర్, ఇస్మాయిల్, ముజీబ్, సోహైల్, సయాఫ్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, మైనార్టీ అధ్యక్షుడు బషీర్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి తదితరులున్నారు.

అత్తాపూర్‌లో బీఆర్‌ఎస్ ప్రచార జోరు..

అత్తాపూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా అత్తాపూర్ గ్రామంలోని దళితబస్తీ, వీకర్ సెక్షన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు జాలిగం చిత్తారి, బాబురావు, ఎం.మల్లేష్‌గౌడ్, ఆనంద్, అరవింద్, జాన్‌పాల్, సురేష్, అభిలాష్, కృష్ణకాంత్, సుశీల తదితరులున్నారు.

- బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ ప్రచారం జోరుగా కొనసాగుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కూడిన పదికి పైగా బృందాలు వేర్వేరు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేపై అసంతృప్తితో కొందరు నాయకులు బుజ్జగించే పనులను పార్టీకి చెందిన కొందరు పెద్దలకు అప్పగించినట్లు సమాచారం. వారికి నచ్చజెప్పి ప్రచారంలో పాల్గొనేందుకు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారని చెబుతున్నారు. మొత్తం మీద కారు ప్రచారం మాత్రం జోరుగా కనిపిస్తోంది.

ప్రజలంతా బీఆర్‌ఎస్‌తోనే..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ గ్రామంలో బన్సీలాల్‌నగర్, దోభీబస్తీ, వర్మ కాలనీ, శ్రీకృష్ణ సాయికాలనీలో పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగు చెరువు మహేష్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి తిరుగుతూ.. కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. నాయకులు చలసాని విష్ణుమూర్తి, యాదమ్మ, రాపోలు సత్తయ్య, వినాయక ప్రీతం రాజు, అనుముల జాన్‌పాల్, రాజు, సాయిగౌడ్, సాయిమల్లిక్, మజ్జిగ నరేష్ యాదవ్, సుమలత, సుజాతగౌడ్, జబీన్ హుస్సేన్, యశోద, చంద్రకళ, ప్రొఫెసర్ డాక్టర్ కోరని రవీందర్, పట్నం నరేష్, రాజుగౌడ్, రజనీకాంత్‌గౌడ్ తదితరులున్నారు.

జోరుగా మజ్లిస్ ప్రచారం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లో ఆదివారం మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి స్వామియాదవ్ ఎమ్మెల్సీ రహమత్‌బేగ్‌తో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ మజ్లిస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను విన్నవించారు. మాజీ కార్పొరేటర్ ఆరీఫ్, నవాజ్ మహ్మద్, జహంగీర్ తదితరులున్నారు.

పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



బోనాలతో దేవాలయానికి వచ్చిన ఖానాపూర్ గ్రామస్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో పోచమ్మ అమ్మవారి దేవాలయ మూడో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామం నుంచి దేవాలయానికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, దేవాలయ కమిటీ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాలయ ఆవరణలో మధ్యాహ్నం పెద్దఎత్తున నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు.

రాజేంద్రనగర్ సమగ్రాభివృద్ధికి కృషి



ప్రశాంత్‌నగర్‌కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ సమగ్రాభివృద్ధి కోసం మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని, కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే ప్రజలు మోసపోతారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ లతా ప్రేమ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్, సాయిబాబా కాలనీలలో బీఆర్‌ఎస్ పార్టీ సమావేశం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది విద్య, ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక ప్రగతి కోసం పథకాలు ప్రవేశపెట్టి వారికి ఆర్థిక అభివృద్ధి వైపు పయనింపజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్‌ఎస్‌తోనే అందరికి న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమాలు పరుగులు తీసుకున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, నీటి కష్టాలు పోయాయని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పేదలకు మేలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, విష్ణుపురం ప్రభాకర్‌గౌడ్, ప్రశాంత్‌నగర్, సాయిబాబా కాలనీ వాసులు పాల్గొన్నారు.



సిక్ చావునీలోఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎంపీ రంజిత్ రెడ్డి

సిక్ చావునీలో ప్రత్యేక ప్రార్థనలు..

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో ఇంటింటి ప్రచారంలో భాగంగా సిక్ చావునీ గురుద్వారా మందిరాన్ని దర్శించి మత పెద్దలతో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమావేశమయ్యారు. వీకర్ సెక్షన్ కాలనీ, రాంబాగ్ మల్లయ్య టవర్స్, రామాలయం టెంపుల్ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. వనం శ్రీరామ్‌రెడ్డి, మిద్దెల సురేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అమరేందర్, పీఎంరెడ్డి, శివశంకర్, శ్రీధర్‌రెడ్డి, శివారెడ్డి, రవి, ఎం.నరేష్, కృష్ణ తదితరులున్నారు.

బీజేపీ విజయాన్ని అడ్డుకునేందుకు కుట్రలు



తోకల ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన సిద్ధంతి వాసులు

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో బీజేపీ పార్టీ విజయాన్ని అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్, మజ్లిస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుట్ర పన్నుతున్నాయని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉప్పర్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మూడు పార్టీలు కలిసి బీజేపీ ఓట్లను చీల్చి విజయం సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో బీజేపీ రోజు రోజుకు బలంగా మారుతుందన్నారు. యువకులు, మహిళలు, యువతులు, వృద్ధులంతా పార్టీకోసం పని చేస్తున్నారన్నారు. వారిని విచ్ఛిన్నం చేసేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ ప్రజల మద్దతు ఉన్న బీజేపీని ఓడించడం మజ్లిస్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు సాధ్యం కాదన్నారు. రాజేంద్రనగర్‌లో మూడు పార్టీలు కలిసి బీజేపీ విజయాన్ని అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయన్నారు. ఓటర్లు ఇప్పటికే ఓటు బీజేపీకి వేయాలని నిర్ణయించుకున్నారని అభిప్రాయపడ్డారు. ఓటర్లు నిర్భయంగా పోలింగ్ బూత్‌లకు వచ్చి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. పార్టీ నాయకులు బాబురావు, బొక్కా బాల్‌రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, సందీప్ ముదిరాజ్, విఠల్, మల్లేషచారి, విజయ్‌యాదవ్ తదితరులున్నారు.



తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బీజేపీకి భారీ మెజార్టీ ఖాయం..

శంషాబాద్ : భారీ మెజార్టీతో తన గెలుపు ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన యువకులు పెద్దఎత్తున బీజేపీలో చేరారు. 15 ఏళ్లుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. బీజేపీ రాకతో నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోయేలా కృషి చేస్తానన్నారు. బీజేపీలో చేరిన యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె. దేవేందర్, రమేష్, జగ్గీవన్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. సాయిరాం ఎన్‌క్లేవ్‌కాలనీలో హై టెన్షన్ వైర్ నుంచి ఇళ్లల్లోకి షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. కాలనీలోని సాయిరాం ఎన్‌క్లేవ్ కాలనీలోని సందీప్, నాగరాజు, వినోద్, మహేందర్ ఇళ్లల్లోకి ఫ్రిజ్‌లు, టీవీలు, గీజర్లు, వైరింగ్ కాలిపోయాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ×డోర్ టూ డోర్× చెత్త సేకరణను హైదర్షాకోట్‌లో పరిశీలించారు. రోడ్ల స్వీపింగ్, హైదర్షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో జరిగే చాట్ పూజ వద్ద క్లీనింగ్ పనులను పరిశీలించారు. 5వ వార్డు కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి, కాలనీ వాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, బిల్ కలెక్టర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ జవాన్లు తదితరులున్నారు.



హైదర్షాకోట్ చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

సమాజ సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

గోల్కొండ: సమాజ సేవే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ అధ్యక్షుడు రోటేరియన్ అనిల్ రాంచందాని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం టాయిలెట్స్ నిర్మించడానికి రోటరీ క్లబ్ వారు ఫండ్ రైజింగ్ గోల్ఫ్ ఫర్ చారిటి గర్నమెంట్ 2023 నిర్వహించారు. ఆదివారం గోల్కొండ నయాకీలాలోని హైదారాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన రోటేరియన్స్‌కు ఆయన హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌ఠాగూర్‌తో కలిసి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఫండ్ రైజింగ్ ద్వారా కోటి రూపాయలు విరాళాల రూపంలో వచ్చిందని, వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం వంద టాయిలెట్స్ నిర్మిస్తామని ఆయన అన్నారు. సికింద్రాబాద్ గురుద్వారాలో 15 పడకల డయాలసీస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ప్రతి యేటా ఇక్కడ నామమాత్రం చార్జీలతో పది వేల మందికి డయాలసీస్ అందిస్తున్నామని తెలిపారు. ఈరోజు నిర్వహించిన ఛారిటీ గోల్ఫ్ టోర్నమెంట్‌లో వంద మంది ఔత్సాహిక గోల్ఫర్లు పాల్గొన్నారని ఆయన అన్నారు.

బోసిపోయిన రోడ్లు !

రాజేంద్రనగర్: వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి. ప్రతిరోజు రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం అడపాదడప వాహనాలతో కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాఫిక్ జామ్‌లతో ఉన్న ఆరాంఘర్ చౌరస్తా, హైదర్‌గూడ, అత్తాపూర్, కాటేదాన్, ఉడెంగడ్డ, గగన్‌పహాడ్, రాజేంద్రనగర్ రహదారులు మ్యాచ్ ప్రారంభమై అనంతరం బోసిపోయి కనిపించాయి. ఆదివారం కావడంతో వ్యాపార సంస్థలు సైతం బంద్ ఉండడం... క్రికెట్ మ్యాచ్‌ను చూసేందుకు ప్రజలంతా ఇళ్లల్లోనే ఉండటంతో రోడ్లపై ఎవరూ కనిపించలేదు. ఎన్నికల ప్రచారం ఉన్నప్పటికీ.. ప్రధాన పార్టీ అభ్యర్థులు మ్యాచ్ ప్రారంభం అనంతరం తమ ప్రచారాలను నిలిపివేసుకున్నారు. కేవలం తమ ముఖ్య నాయకులతో సమావేశాలు, సమీక్షలు చేస్తూ కనిపించారు.



కాటేదాన్ ప్రధాన రహదారి

ఘనంగా సహస్రార్జున్ జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న సమాజ్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: శ్రీ సోమవంశ సహస్రార్జున్ క్షత్రియా సమాజ్ (ఎస్ఎస్‌కే సమాజ్) రాజేంద్రనగర్ గ్రామసభ ఆదివారం శ్రీ సహస్రార్జున్ భగవాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ ఆనంద్ రావు మెంగ్‌జీ మాట్లాడుతూ.. సామాజిక సంక్షేమానికి కాకుండా మానవ సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మనల్ని కట్టిపడేసే విలువలను ఒక్కసారి ఆలోచించుకుందామన్నారు. లెజెండరీ సహస్రార్జున్ భగవాన్ న్యాయం, బలం, ఐక్యత పట్ల అచంచలమైన నిబద్ధతకు ప్రసిద్ధి చెందారన్నారు. అనంతరం ఎస్ఎస్‌కే సంఘం గోత్రావళి, సహస్రార్జున్ మహారాజ్ పోస్టర్లు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. సమాజ పెద్దలు వెంకటేష్ చవాన్, రాజ్‌కుమార్ జ్యోతి, విఠల్ జితూరి, వైస్ ప్రెసిడెంట్ ఉమేశ్ చవాన్, జనరల్ సెక్రటరీ రాజేష్ హబీబ్, ట్రెజరర్ రజనీకాంత్ తిర్మల్ తదితరులున్నారు.

ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి

గన్‌ఫౌండ్రీ: ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు అన్నారు. ఆదివారం శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బండారు సుబ్బారావు 68వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సర్వీస్ ఐకాన్ బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శృతిలయ ఆర్ట్స్ కార్యదర్శి ఆమని, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు పాల్గొన్నారు.